క్లుప్తంగా

పశువులకు గొంతువాపు నిరోధక టీకాలు

గూడూరు: పశువుల్లో గొంతువాపు వ్యాధిని నివారించడానికి ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తోందని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎస్.సి.హెచ్.నరసింహులు అన్నారు. సోమవారం గూడూరులోని వెటర్నరీ డిస్పెన్సరీలో గొంతువాపు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రారంభించారు. నరసింహులు మాట్లాడుతూ జూన్ 24న ప్రభుత్వం మొదటి విడత గొంతువాపు వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం చేపట్టిందన్నారు. అలాగే డిసెంబరు 21 నుంచి 31 వరకు రెండో విడత గొంతువ్యాపు నిరోధక టీకాలకు శ్రీకారం చుట్టిందని వివరించారు. దీనిలో భాగంగా జిల్లాలోని 75వేల పశువులకు టీకాలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గూడూరు పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ



నాగాయలంక: అవనిగడ్డ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం నాగాయలంక మండల స్థాయి శిక్షకుల శిక్షణ స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సీడీపీఓ శేషుకుమారి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులు తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్ మాట్లాడుతూ కిశోరి వికాసం ఆవశ్యకతను వివరించారు. ప్రతి సచివాలయం పరిధి నుంచి ఐదుగురు సభ్యుల చొప్పున 80 మంది శిక్షణకు హాజరయ్యారు. తర్వాత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, కిశోర్, సునీత, ఎస్ఎం భాగ్యలక్ష్మి, సీసీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మత్స్య ఉత్పత్తులపై ముగిసిన శిక్షణ



భావదేవరపల్లి(నాగాయలంక): ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(హైదరాబాద్), కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటశాల)ఆధ్వర్యాన స్థానిక మండలి కృష్ణారావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులపై శిక్షణ సోమవారం ముగిసింది. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన 30మంది మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. సర్పంచి మండలి ఉదయ భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలోని వివిధ వర్గాల మహిళలకు నైపుణ్య శిక్షణ ఇచ్చిన కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటశాల)శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు చెప్పారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ శిక్షణలో తయారు చేసిన వంటలను వివరించారు. 30మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు డాక్టర్ అల్లి అశ్రిత, విశాలకుమార్, డాక్టర్ కె. రేవతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో 'వాసవి' ప్రతిభ



పెడన: స్టేట్ బోర్డు నిర్వహించిన ఐపీఎస్‌జీఎం-2024 రీజనల్ మీట్‌లో పెడన నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పలు ఈవెంట్లలో మెడల్స్‌ను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీకే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20, 21వ తేదీల్లో పాలిటెక్నిక్ బాలబాలికలకు పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ఎ.శిరీష డిస్కస్‌త్రోలో స్వర్ణం, డి.యశ్వంతి రజితం, షార్ట్‌పుట్‌లో వి.తేజప్రవళిక రజితం, డి.యశ్వంతి కాంస్యం, 100 మీటర్స్ రన్నింగ్‌లో వై.బోనిక రజతం, తదితరులు హైజంప్‌లో ఎం.స్టీఫెన్‌రాజు స్వర్ణం కైవసం చేసుకోగా జితేంద్ర కాంస్యం గెలుచుకున్నారని పేర్కొన్నారు. టేబుల్ టెన్నిస్‌లో పి.మణికంఠ రన్నర్‌గా నిలిచారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు అభినందించారని పేర్కొన్నారు.

వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: క్రిస్మస్ సందర్భంగా గాడేల్లి జోసెఫ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 31వ డివిజన్ శారదా నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద కాలనీలోని వృద్ధులకు, మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాడెల్లి వసంతరావు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోకవరం కేడీసీసీ బ్యాంక్ సెక్రటరీ ఎం. భాస్కరరావు(స్వామి) అంగన్‌వాడీ కేంద్రానికి స్టాండ్ ఫ్యాన్ వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు భాస్కరరావు, గాడెల్లి ప్రణీత్, అలేఖ్య, కుమారి, కియారా సంజన, పాస్టర్ యేసేపు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- పులిగడ్డ వారధికి కూతవేటు దూరంలో ఇసుక తరలింపు
- జనసేన నేత కనుసన్నల్లో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- కుమ్మరిపాలెం నుంచి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు



పులిగడ్డ కృష్ణానది పక్కన పడవల్లో నుంచి ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేస్తున్న కూలీలు

అవనిగడ్డ: నియోజకవర్గంలో ఇసుక దోపిడీకి టీడీపీ, జనసేన నేతలు బార్లాగా తలుపులు తెరిచ్చారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అవనిగడ్డ, కోడూరు మండల పరిధిలోని పలు చోట్ల పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోపోవడంపై విమర్శలకు తావిస్తోంది. జనసేన, టీడీపీ నాయకులు అండదండలతో తవ్వకాలు జరుగుతుండటంతో అధికార యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పులిగడ్డ వారధికి కూతవేటు దూరంలో..

అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ హైలెవల్ వారధికి కూతవేటు దూరంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పడవల నుంచి ఇసుకను తీసుకొచ్చి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ నాయకుల అండదండలతో పాటు జనసేన ముఖ్యనేత అండ పుష్కలంగా ఉండటంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కొంతమంది అంటున్నారు. కోడూరు మండల పరిధిలోని కుమ్మరిపాలెం నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా సాగుతోంది. రెవెన్యూ పరంగా కోడూరు మండలంలో ఉన్నా భౌగోళికంగా మోపిదేవి మండలాల్లో ఉండటంతో ఇసుక అక్రమ దారులు రెచ్చిపోతున్నారు. ఇక్కడ నుంచి ప్రతిరోజూ పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఎడ్లబండ్లకు అభ్యంతరాలు చెబుతున్న రెవెన్యూ, పోలీసు యంత్రాంగం యథేచ్ఛగా ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా చూసీచూడనట్టు వదిలేస్తున్నారని కొంతమంది ఎడ్లబళ్లదారులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



పులిగడ్డ వారధికి సమీపంలో కృష్ణానదిలో పడవల్లో ఇసుక

ఎలాంటి అనుమతులు లేవు

పులిగడ్డలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఈ విషయం నా దృష్టికి రాలేదు. కృష్ణా నది నుంచి ఎవరైనా ఇసుక తవ్వకాలు జరిపితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– కె.నాగమల్లేశ్వరరావు, తహసీల్దార్, అవనిగడ్డ

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్యసమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన గూడూరు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం జరిగింది. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో పాటుగా వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ ఆహ్వానాలు పంపారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా చాలా శాఖల అధికారులు రాకపోవడంతో ఆలస్యంగానే ప్రారంభించారు. ఒక్కో విభాగ సమీక్షను ఎంపీపీ ప్రారంభించారు. తీరా చూస్తే మండలస్థాయిలో 24 ప్రభుత్వ విభాగాల అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారు. దీంతో అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాగే గైర్హాజరు కావడంతో సమావేశానికి రాని అధికారులను పిలిచి వివరణ తీసుకున్నామని, ఇప్పుడ రాకపోవడం శోచనీయమన్నారు. గైర్హాజరైన అధికారుల వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ బి.రాజేశ్వరిని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల స్థానంలో వారి భర్త, కుమారులను సభకు అనుమతించడం అభ్యంతరకరమన్నారు. ఇక నుంచి సభకు సభ్యులను మాత్రమే అనుమతించాలని కోరారు. వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, ఎంపిడిఓ బి.రాజేశ్వరి, డీటీ కె.జ్ఞానసాయి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డ 'తమ్ముళ్లు'

- వచ్చే నెల 4వ తేదీన పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- అధికారులు పట్టించుకోవడం లేదు
- సమన్వయ కమిటీ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేతలు రావి నాగేశ్వరరావు, జానకీరాంబాబు
- బుజ్జగిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి



సమన్వయ కమిటీ సమావేశంలో పరిశీలకుని ముందు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు



మోపిదేవిలో నాగేశ్వరరావుని బుజ్జగిస్తున్న పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ: కూటమి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తీరుపై టీడీపీ నేతలు మండిపడ్డారు. అవనిగడ్డలో సోమవారం జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు సాక్షిగా తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 4న పదవులకు రాజీనామా చేస్తామని కొంత మంది ప్రకటించగా, మంగళవారం పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని మరికొంతమంది హెచ్చరించారు. అధికారంలో ఉన్నామో.. ప్రతిపక్షంలో ఉన్నామో తెలియడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొంతమంది మధ్యలోనే వెళ్లిపోయారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

తాము పనిమీద పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా, ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా మామాట ఎవరూ లెక్క చేయడం లేదని మోపిదేవికి చెందిన ఎంపీపీ రావి దుర్గారాణి, టీడీపీ నాయకుడు రావి నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు, బొబ్బర్లంక ఎంపీటీసీ వారికి మద్దతుగా వారి అక్కసు వెళ్లగక్కారు. టీడీపీ వారి మాటలు ఎవరూ లెక్క చేయడం లేదని, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆ విధంగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. జనవరి 4న మోపిదేవిలో జరిగే టీడీపీ సాధారణ సమావేశంలో పదవులకు రాజీనామా చేస్తామని రావి నాగేశ్వరరావు హెచ్చరించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. కె కొత్తపాలెంకు చెందిన మరికొంతమంది నాయకులు రేపే పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు. మోపిదేవిలోని రావి నాగేశ్వరరావు ఇంటికి నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు వెళ్లి బుజ్జగించే ప్రయత్నం చేసినా వినలేదని తెలిసింది. ఇటీవల టీడీపీకి చెందిన కొంతమందిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వయంగా జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నప్పటి నుంచి టీడీపీ నేతలు కొందరు రగిలిపోతున్నారు. సమన్వయ కమిటీ సమావేశంలో కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేయగా మరికొంతమంది వారి బాటలోనే పయనించడానికి సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

మచిలీపట్నంటౌన్: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. పలుచోట్ల సెమీక్రిస్మస్ వేడుకలు చేశారు. నగరంలోని చర్చిలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ దీపాలంకరణ చేశారు. చర్చిల వద్ద ఏర్పాటు చేసిన పెద్ద స్టార్లు, క్రిస్మస్ ఇతి వృత్తాన్ని తెలిపేలా బొమ్మలతో ఏర్పాటు చేసిన పాకల సెట్టింగులు ఆకర్షిస్తున్నాయి. చిలకలపూడిలోని ఫెయిత్ టెంపుల్, తెలుగు చర్చి, మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చి, చర్చి ఆఫ్ గాడ్ చర్చి, రైలుపేటలోని బేతేలు ప్రార్థనా మందిరం, పరాసుపేట, శారదానగర్‌లలోని ఆర్సీఎం చర్చిలలో ఏర్పాటు చేసిన ఈ సెట్టింగ్‌లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- కృత్తివెన్నులో 216 జాతీయ రహదారి పక్కన ఇమ్మానియేల్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యాన పాస్టర్ డానియల్‌రాజు ఏర్పాటు చేసిన భారీ స్టార్ ఆకట్టుకుంటోంది.

అవనిగడ్డ: మండలంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాదేవి, అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమ, పలువురు ఎంపీటీసీలు క్రిస్మస్ కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, సర్పంచ్

- ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థ ఆవరణలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.
- చల్లపల్లి మండలం మేకావారిపాలెంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ అల్లంశెట్టి ఎర్మియా చర్చిలో జరిగిన వేడుకల్లో ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ కేక్ కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీనివాసరావు, రిటైర్డ్ ఈవోపీఆర్‌డీ దాసి సీతారామరాజు పాల్గొన్నారు.

ఎదురుమొండి(నాగాయలంక): ఎదురుమొండిలో ఆల్మైటీ గాడ్ చర్చ్ మినిస్ట్రీస్ (ఏజీసీఎం)అధినేత చిట్టా రారాజు ఆధ్వర్యంలో పాస్టర్ జాన్ చక్రవర్తి పరిచర్యలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. దివిసీమ గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు, అవనిగడ్డ జనసేన యువనేత మండలి వెంకట్రామ్(రాజా) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ, గ్రామ పెద్దలు రాజాను ఘనంగా సన్మానించారు. రెవ.బుజ్జిబాబు, స్థానిక నీటిసంఘం అధ్యక్షుడు నాయుడు బాబూరావు, మండల టిడిపి అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల అంబేద్కర్‌నగర్‌లో బాల ఏసు స్వరూపంతో పలు గృహాల్లో ఆర్సీఎం ఫాదర్ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చల్లపల్లి సాలిపేట ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల విశ్వాసులతో ఘంటసాలకు విచ్చేసి పలు గృహాల్లో ప్రార్థనలు జరిపారు. విశ్వాసులు ప్రార్థనా గీతాలు ఆలపించారు.

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టరు సాబుజాన్, పాస్టరు జాషువా, హెచ్ఎం ఝాన్సీసాబూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైలుపేటలోని బేతేలు ప్రార్థనా మందిరం



విద్యుత్ దీపాల కాంతుల్లో నోబుల్ చర్చి



కృత్తివెన్నులో భారీ క్రిస్మస్ స్టార్

వైభవంగా పైడమ్మ జాతర



పైడమ్మ చెరువులో అమ్మవారి తెప్పోత్సవం

పెడన: పైడమ్మ జాతర మహోత్సవాలు పెడన పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 14న ప్రారంభమైన ఈ జాతర మహోత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అత్యంత భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం జరిగింది. సోమవారం రాత్రి పైడమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి హంస వాహనం(పడవ)పై పైడమ్మ చెరువులో తెప్పోత్సవం (ఊరేగింపు)నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆలయ ఈవో మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మంగళవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. జనవరి 5వ తేదీ భారీ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మచిలీపట్నానికి బస్ సర్వీస్ ప్రారంభం



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తూ పూజలు చేస్తున్న దృశ్యం

కోడూరు: మచిలీపట్నం నుంచి కోడూరుకు ఆర్టీసీ అధికారులు నూతన బస్ సర్వీస్‌ను సోమవారం నుంచి ప్రారంభించారు. కోడూరు నుంచి మచిలీపట్నం వెళ్లేందుకు అవనిగడ్డ, చల్లపల్లి, మాజేరు మీదుగా సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. కోడూరు, బందరు మండలాలను అనుసంధానం చేస్తూ కృష్ణానదిపై 'ఉల్లిపాలెం-భవానీపురం' వారధిని నిర్మించారు. ప్రస్తుతం ఈ వారధి మీదగా మచిలీపట్నంకు కోడూరు నుంచి బస్సు సర్వీసును ప్రారంభించారు. దీంతో మండల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి 20 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. స్థానిక బస్‌స్టాండ్‌లో కూటమి నేతలు బస్సుకు పూజలు చేశారు. ఉదయం 6గంటలకు మచిలీపట్నంలో బస్సు బయలుదేరి 7.30గంటలకు కోడూరుకు చేరుతుందని, కోడూరు నుంచి తిరిగి 7.45గంటలకు మచిలీపట్నంకు వెళ్లేందుకు బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సాయంత్రం 5గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి 6.30గంటలకు కోడూరుకు వస్తుందని, ఇక్కడ నుంచి మళ్లీ తిరిగి 6.45గంటలకు మచిలీపట్నంకు బయలుదేరుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోండి

మచిలీపట్నంటౌన్: జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నగరంలోని రేవతి సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలన సూత్రాలకు కట్టుబడి పనిచేయడం లేదన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి అజాద్ మాట్లాడుతూ పంజాబ్, హరియాణాలోని మార్కెట్‌లలో సేకరణను అడ్డుకోవడానికి కార్పొరేట్ చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, సీపీఐ నేతలు సురేంద్ర, పి.శివనాగేంద్రం, శీలం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పది రోజులైనా చిన్నారి జాడే లేదు

అవనిగడ్డ: పది రోజుల క్రితం అదృశ్యమైన మూడేళ్ల ఆవుల దివ్య మిస్సింగ్ కేసు పోలీసు అధికారులకు పెనుసవాల్‌గా మారింది. స్థానిక పంచాయతీ పరిధిలోని నేరెళ్లపాలెం వంతెన సమీపంలో పంటకాలువ పక్కన నివసించే ఆవుల గోపి, కొండాలమ్మకు చెందిన మూడేళ్ల దివ్య ఈనెల 14న అదృశ్యమైంది. పక్కనే పంటకాలువలో పడి ఉంటుందని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో ప్రత్యేక గాలింపు చర్యలు చేస్తున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసే వారైతేనే ఇలా ఎవరికీ చిక్కకుండా ఉడాయిస్తారనే ఊహాగాలు వెల్లువెత్తుతున్నాయి. దివ్య జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు.

రెవెన్యూ గ్రామంగా విభజించండి

ఘంటసాల సర్పంచ్ దోనె రజని

ఘంటసాల: పంచాయతీకి ఆదాయం లేక అభివృద్ధిలో వెనకపడుతున్నామని అధికారులు తక్షణమే స్పందించి మా పంచాయతీని రెవెన్యూ గ్రామంగా విభజించాలని కోరుతూ ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజని రెవెన్యూ సదస్సులో సోమవారం అర్జీ సమర్పించారు. సర్పంచ్ రజని మాట్లాడుతూ 1958 ఫిబ్రవరి 23న మచిలీపట్నం కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఘంటసాల మండలం ఘంటసాలపాలెం ఆర్‌ఓసీ నెం.9340/56బి ప్రకారం నూతన పంచాయతీగా ఏర్పడిందన్నారు. 1976 మే 18న నోటిఫై చేశారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఘంటసాలపాలెం గ్రామ పంచాయతీ ఘంటసాల రెవెన్యూ గ్రామంగానే పరిగణలో ఉన్నదన్నారు. గ్రామ పంచాయతీ రెవెన్యూ సరిహద్దులు ఏర్పరచి, సర్వే నంబర్లు తెలియపర్చి రెవెన్యూ గ్రామంగా విభజించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

28న ఏక సభ్య కమిషన్ రాక

చిలకలపూడి(మచిలీపట్నం): ఏక సభ్య కమిషన్ ప్రతినిధి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఈ నెల 28న మచిలీపట్నం రానున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం తెలిపారు. కమిషన్ సభ్యులు షెడ్యూల్డ్ కులాల్లోని ఉపవర్గీకరణపై విచారణ చేయడానికి కమిషన్ రానున్నదన్నారు.

పీవీకి నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని మునిసిపల్ పార్కు వద్ద ఉన్న పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సోమవారం రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో వైద్యుడు ధన్వంతరీఆచార్య, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీబాబా ప్రసాద్, పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ప్రధాన అనఘాష్టమీ వ్రతం

నాగాయలంక: మండల దత్త భక్త బృందం ఆధ్వర్యంలో మార్గశిర బహుళ అష్టమి పురస్కరించుకుని స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం సామూహిక ప్రధాన అనఘాష్టమీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. దత్తపురోహితుడు శనగపల్లి వెంకటరావు బ్రహ్మత్వంలో ప్రధాన పీఠం వద్ద జరిగిన కలశ పూజలో వేమూరి రవి, పావని దంపతులు పీటలపై కూర్చున్నారు. స్థానిక విద్యాభారతి పబ్లిక్ స్కూలు విద్యార్థులు, పరిసర గ్రామాల మహిళలు 108మంది పీటలపై కూర్చుని సామూహిక వ్రతం ఆచరించారు. తొలుత దత్త పాదుకలతో విద్యార్థులు, దత్తభక్తులు నాగాయలంక ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, దత్తబృందం ప్రతినిధి చిట్టా రామలింగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు మానేపల్లి శ్రీనివాసరావు, తాడికొండ సత్యనారాయణ, దత్త భక్తులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అనఘాష్టమి వ్రతం జరిగింది. ఈ వ్రతంలో 150 మంది భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేసింది.

చర్చి అభివృద్ధికి సాయం

నాగాయలంక: అవనిగడ్డకు చెందిన విక్కుర్తి రాఘవయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గ్రామంలోని 12వ వార్డులో శ్లాబు దశలో ఆగిపోయిన సీబీఎం చర్చి అభివృద్ధికి ట్రస్ట్ చైర్మన్ విక్కుర్తి శ్రీనివాసరావు రూ.25 వేలు సాయం అందజేశారు. రాజేశ్వరికాలనీకి చెందిన బందెల నాగబాబు, బందెల సోమేశ్వరరావు చర్చి నిర్మాణ దశలో ఆగిపోయిన విషయంపై విక్కుర్తికి చేసిన అభ్యర్థన మేరకు ఆయన స్పందించారు. క్రిస్మస్ పర్వదినాల నేపథ్యంలో చర్చి నిర్మాణ పెద్దలు, మహిళలు ఆయనను కలవగా రూ.25వేలు మొత్తాన్ని అందించినట్లు నాగబాబు సోమవారం తెలిపారు.